# సంఘానికి వెరిస్తే!! ★

శ్రీమతి వట్టి, అమ్మాజీగారు

"మోహన్! మన భారతదేశంలో నావలె సంఘ దురాచారాలకు బలియైన కష్టజీవులు, వ్యర్థజీవులు ఎంత మంది న్నారో కదా! ఈ బాల్య వివాహాలు వృద్ధ వివాహాలు! మోహన్! చదువనేదివుంటే ఏ విధంగానో స్వతంత్ర జీవనం చేయవచ్చు. తనయుడు విద్య నేర్వవచ్చు, తనయ విద్య నేర్వ రాదట! ఇది మహాతప్పు! కుమార్తెలకు బాల్యముననే విద్య గరపినట్లయిన వారు పెద్దలై కేవలం పోషణ కొరకు ఒకరి నాశ్రయించకనే స్వతంత్ర జీవనం చేయవచ్చును. ఇక సంఘం, ప్రజలు అని జంకినంత కాలం స్త్రీ జాతికి విముక్తి లేదు. విద్యావతి అయిన స్త్రీ స్వతంత్ర జీవనం చేయటానికనేకమార్గాలున్నాయి. కానీ మోహన్! నావంటి నిర్భాగ్యులకు మరి ఏముంది!"

"విజయా! లేకేమీ! సంఘం! సంఘం! అని మనం సంఘంకోసం వెరిస్తే విముక్తి లేదు. సంఘాన్నెదిరించి సంఘాన్ని సరకు చెయ్యకుండా ఉండటంలోనే విముక్తి అనేదివుంది."

"మోహన్! తల్లి తండ్రులు బిడ్డల నస్వతంత్రులుగ చేసి, కుమార్తెల ఇష్టానిష్టాలను పాటింపకయే వరుడు ధనవంతుడైనచో వృద్ధుడైననుసరే, విద్యా రహితుడైననుసరే, వానికిచ్చి పెండ్లిచేసి తమ పిల్లలను బలియిస్తున్నారు. ఇంతకంటే వేరే శోచనీయమైన సంగతుందా?

"మోహన్! ప్రపంచంల్లో దురదృష్ట వంతురాలని ఎవరయినావుంటే అది నేనే అనుకొంటాను. అమ్మ ఛాందసత్వానికి యేమనాలో తెలీదు. ఆమె ఆచారాలకు యెంతో పట్టుదల చూపించింది. అల్లాగే నాకు పన్నెండేళ్లు దాటాయి. నా కర్మ కాలింది. అమ్మ అవివేకానికి నా జీవితం బలైంది. మా అమ్మ, భాగ్యాన్నిచూచి ముదుసలినికట్టి పెట్టింది. నా అందానికి అతను గర్వించాడు. భాగ్యవంతుడని అమ్మ మురిసింది.

"మోహన్! ఆ రోజుల్లో కష్టం సుఖం అంటే యేమో తెలీదు. అతను విగత జీవుడయ్యాడు. అతనికై విచారించాలనే అగత్యంవుందని తెలీదు. ఇప్పుడు దానికి నేను విచారించను. కానీ సంఘం అట్టి అవివేకానికి పాల్పడ వద్దని నా కోరిక!"

మోహన్ యీ మాటలు విన్నాడు. అతని కళ్ళల్లో అశ్రువులు నిండాయి.

"మోహన్! అప్పట్లో నీ హృదయం ఎంతో పరితపించి వుంటుంది. ఆ నాడు నా దుఃఖానికి అంతులేదు."

"విజయా! భాగ్యవంతులు, పిల్లల్ని భాగ్యవంతుల యింటి కోడళ్ళను చేయాలనే నియమం మనగృహాల్లో పరిపాటైంది. ఇది మీ అమ్మ అభిమతం. కానీ దానికి మంచి చెడ్డల నాలోచించరు కదా!"

"మోహన్! మా అమ్మ, నీవాస్తి పరుడవుకావని తలచిందే కాని మేనరికమని విద్యాధికుడవని రూపవంతుడవని సుగుణ వంతుడవని ఆలోచించలేదు కదా!"

మోహన్ ఆమెను చూస్తున్నాడు. విజయ వొక సౌందర్యదేవతని భావించు కొన్నాడు. సంఘం! ఆమెపై తన దౌష్ట్యం చూపించింది. దానికి ఆమె స్వేచ్ఛాజీవనం బలైంది. ఈ మాటలు పదేపదే అనుకొన్నాడు మోహన్ తనలో...

హాల్లో దీపకాంతులు వారి ముఖాలమీద ప్రసరిస్తున్నవి. మోహన్ విజయ ముఖంలోకి చూస్తున్నాడు. ఆమె కన్నెత్తి అతని వేపుచూచింది. విజయ తన దృష్టిని మరల్చుకోలేక పోయింది. రాత్రి నిశ్శబ్దతలో ఈ మాటలు ప్రక్కగదినుండి రజనివింది. విజయ పల్కులు ఆమె హృదయాన్ని చలింప చేశాయి. ఆమె కప్రయత్నంగా పట్టరాని దుఃఖమొచ్చింది. విజయ మాటలు ఇంకా ఆమెలో ప్రతి ధ్వనిస్తున్నవి. ఆమె హృదయానికి ఆవేదన కల్గింది;

రజని గద్గదిక స్వరంతో వారిని పిల్చింది.

"మీరిద్దరు నన్ను క్షమించండి. మీపట్ల అజ్ఞానినై ఎంత ఘోరమాచరించానో మీకు తెలుసు మోహన్! భాగ్యాని

## సంఘానికి వెరిస్తే

కాసించి గదా నా బిడ్డ బ్రతుకధోగతిపాలు చేశాను! మోహన్! మంచి చెడ్డల నాలోచించకుండా చేయుటవల్ల ఎంత కష్టానికి పాల్పడితిమో ఇప్పుడు తెలుసుకొని పాశ్చాత్తాప పడుచున్నాను. ఇంతకూ కారణం మనపాడు సంఘమే కదా! రజస్వలై రెండు మూడేండ్లు యింటవున్న ప్రళయము వచ్చును. తనయ పెద్దదైన లోకు లేమందురో ఇరుగు పొరుగు అమ్మలక్కలేమి వాగుదురో, అన్న భీతిచేత కదా పెండ్లి చేయునప్పుడు భాగ్యాన్ని చూచి వరుడు ఎట్లున్నను విద్యారహితుడైనను సరే వానికిచ్చి పెండ్లి చేయుచున్నారు. ఇంతకంటె విచారకరమైనవి వృద్ధ వివాహాలుకదా! ఈ వివాహాలవల్ల వుభయకుటుంబాలకు తీరని కష్టనష్టములు కల్గుటే కాక ఆబిడ్డ జీవితమంతా నిష్ప్రయోజన మౌతున్నదికదా!

"మోహన్! నేనెంత ద్రోహ మాచరించితినో యిప్పుడు తెలుసుకొంటిని. అప్పుడు నిన్ను తిరస్కరించి నందులకు నన్ను క్షమించి నా విజయను రక్షించు! సంఘం! క్రూరం! సంఘానికి వెరిస్తే నా బిడ్డ జీవితం అధోగతే. ఇక నేను సంఘానికి వెరువను. విజయకు పునర్వివాహం చేస్తాను!! సుజనకు కూడా ఆమె ఇష్టానుసారమే చేస్తాను. నా బిడ్డల కభ్యంతరం చెప్పను. సంఘానికి వెరువను!"

**ఈ మాటలు రజని ఉత్తేజితరాలై పల్కినది!**

రజని ఈ విధంగా మాట్లాడుటవల్ల విజయా మోహన్ లకు ఆశ్చర్యానందాలు కలిగాయి. తల్లి హృదయంలో ఇంతటి మార్పుకల్గుటచూచి విజయ ఆశ్చర్యపడింది. అప్పుడామెకు కల్గిన ఆనందం వర్ణనాతీతము!!

★

---

శ్రీమతి విజయలక్ష్మిగారు,
యునైటెడ్ స్టేట్సుకు భారతీయ
రాయబారిగా వెళ్లుచున్నారు.

---


# ఆంధ్రశిల్పి

### ప్రతి నెలా ౧౦-వ తేదీని ప్రకటింపబడుతుంది

సంపాదకులు.
శ్రీ గణపతిశాస్త్రి
శ్రీ సాంబశివరావు

ఇది

కథలు — నాటికలు
గేయాలు — పద్యాలు
వ్యాసాలు — కళావిమర్శనలు

మొదలగువానితోను, రంగు రంగుల వివిధ చిత్రాలతోను, వెలువడు కళా సారస్వత వైజ్ఞానిక మాస పత్రిక

ఏజంట్లు లేనిచోట్ల ఏజంట్లు కావాలి.

| సాలు చందా | విడి పత్రిక |
|---|---|
| ౬-౦-౦ | ౦-౮-౦ |

ప్రథమ ద్వితీయ సంపుటాలు బైండింగుతో
సహా ఒక్కొక్కటి ౭-౮-౦

వివరములకు
10, నరసింగపురం వీధి, మౌంటురోడ్,
మదరాసు